www.prajasakti.com


ప్రజాశక్తి

ఆదివారం 25 డిసెంబర్ 2022 5

కాకినాడ



క్రిస్మస్ దీప కాంతుల కళ కళ...



ప్రజాశక్తి-కాకినాడ కార్పొరేషన్
క్రిస్మస్ సందర్భంగా క్రీస్తు జన్మదిన వేడుకలు జిల్లా అంతటా ఘనంగా నిర్వహించుకునేందుకు చర్చిలు సుందరంగా, విద్యుత్ కాంతులతో కళకళలాడుతున్నాయి. కాకినాడ జగన్నాధపురం చరిత్ర గాంచిన ఆలయాల్లో అర్ధరాత్రి క్రిస్మస్ వేడుకలు ప్రారంభమయ్యాయి. క్రైస్తవులు కుటుంబసమేతంగా హాజరయ్యారు. భక్తులతో కిటకిటలాడాయి. యువతీ యువకులు ప్రత్యేక ప్రార్ధనల్లో క్రిస్మస్ గీతాలను ఆలపించారు.

చారిత్రక సంపదపై తీవ్ర నిర్లక్ష్యం

- శిథిలావస్థలో పురావస్తు భవనం
- మూలపడ్డ విగ్రహాలు, వస్తువులు



కాకినాడలోని పురావస్తు శాఖ మ్యూజియం

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి
వెల కట్టలేని చారిత్రక సంపదపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. అతి పురాతనమైన, అత్యంత విలువైన వివిధ విగ్రహాలు, వస్తువులను పూర్తి స్థాయిలో సంరక్షించలేకపోతోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. భవనం శిథిలావస్థకు చేరి విలువైన వస్తువులు పాడయ్యే పరిస్థితి ఉన్నా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

జిల్లా కేంద్రం కాకినాడ రామారావు పేటలోని పురావస్తు శాఖ ఆధీనంలో మ్యూజియం ఉంది. తెలుగు భాషా వికాసానికి, సంస్కృతీ, సంప్రదాయాలకు న్యాయం చేకూర్చాలని జయంతి రామయ్య పంతులు, వేదం వెంకటరామశాస్త్రి, కామరాజు లక్ష్మణరావు పంతులు వంటి ప్రముఖ పండితులను ఆహ్వానించి పిఠాపురం బొబ్బిలి వెంకటగిరి సంస్థానాధీశ్వరుల సాయంతో మద్రాసులో 1911లో ఆంధ్ర సాహిత్య పరిషత్ స్థాపించారు. అనేక తెలుగు గ్రంథాలు, తాళపత్ర గ్రంథాలను పిఠాపురం, బొబ్బిలి రాజుల సహకారంతో 1925లో వీటిని కాకినాడకు తరలించారు. 1973లో ఆంధ్ర సాహిత్య పరిషత్ భవనాన్ని గ్రంథాలతో పాటు రాష్ట్ర పురావస్తుశాఖకు అప్పగించారు. అప్పటినుంచి ఆంధ్ర సాహిత్య పరిషత్ గవర్నమెంట్ మ్యూజియంగా పేరు పెట్టి నిర్వహిస్తున్నారు. పురావస్తు పరిశోధనలతో పాటు మ్యూజియంలోని లైబ్రరీలో భద్రపరిచిన తాళపత్ర గ్రంథాలు, వివిధ దేశాలు, రాష్ట్రాల్లోని రీసెర్చ్ స్కాలర్లకు, పండితులకు, విద్యార్థులకు ఎంతగానో ఈ మ్యూజియం ఉపయోగపడుతోంది. సంవత్సరానికి సుమారు 15 వేల మంది విద్యార్థులు, చారిత్రక పరిశోధకులు ఈ మ్యూజియాన్ని సందర్శిస్తున్నారు.

వెల కట్టలేని చారిత్రక సంపద నిక్షిప్తం

కాకినాడ పురావస్తు శాఖ మ్యూజియంలో ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల పురావస్తు సంపద ఇక్కడ నిక్షిప్తమై ఉంది. బౌద్ధులు, ఇక్ష్వాకులు, చాళుక్యుల (సుమారు 800) ఏళ్ల నాటి దాదాపు 450 వరకూ వివిధ రాతి విగ్రహాలు, రాగి రేకులు, శాసనాలు, ఆయుర్వేద గ్రంథాలు, ఐదు వేలు వరకు తాళపత్రాలు ఉన్నాయి. ఈ తాళపత్రాల్లో వేదాలు, రామాయణ, మహాభారత, పురాణ, ఇతిహాస గ్రంథాలు, ఆయుర్వేద గ్రంథాలు, ఇతర గద్య, పద్య కావ్యాలు వివిధ రకాల శతక గ్రంథాలు, జ్యోతిష గ్రంథాలు ఉన్నాయి. క్రీ.శ 5వ శతాబ్దంలో విష్ణు కుండినుల కాలం, క్రీ.శ 16వ శతాబ్దంలో మొగలులు, కుతుబ్ షా కాలం,13వ శతాబ్దంలో ఢిల్లీ సుల్తాను కాలం, 19వ శతాబ్దంలో ఈస్ట్ ఇండియా కంపెనీ కాలం నాటి 300 వరకు పురాతన నాణేలు, 17, 18 శతాబ్దాల మధ్య రచించిన సుమారు 15 వేల వరకు అతి ప్రాచీనమైన గ్రంథాలు, శాతవాహన కాలం నుంచి బ్రిటీష్ వారి కాలంనాటి వరకు వివిధ తవ్వకాల్లో బయటపడిన పురావస్తు సంపద అంతా ఇక్కడే ఉంది. గోదావరి పరీవాహక ప్రాంతంలో లభించిన జంతు శిలాజాలు, క్రీ.శ 18 శతాబ్దం నాటి కత్తులు, పదో శతాబ్దం నాటి నటరాజ విగ్రహం, 19వ శతాబ్దం నాటి గోపిక విగ్రహాలు, మొదటి ప్రపంచ యుద్ధంలో వాడిన కత్తి, క్రీ.శ 18వ శతాబ్దం నాటి పాచికలు, క్రీ.పూ 2,50,000 కాలం నాటి పాత శిలా యుగపు రాతి పనిముట్లు ఇలా అనేక అతి పురాతన సంపద ఇక్కడే ఉంది.

నిర్లక్ష్యపు నీడలో చారిత్రక సంపద

అత్యంత విలువైన చారిత్రక సంపదంతా ఇప్పుడు నిర్లక్ష్యపు నీడలో కొట్టుమిట్టాడుతోంది. నిలువ నీడ లేకుండా పలు రాతి విగ్రహాలు ఆరుబయటే దర్శనమిస్తున్నాయి. ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ పాడయ్యే పరిస్థితిలో ఉన్నాయి. భవనం శిథిలావస్థకు చేరడంతో వర్షా కాలంలో వర్షపు నీరు వెలుపలికి వచ్చి చేరుతుండడంతో పురావస్తు సంపదకు ప్రమాదం వచ్చి పడింది. ఉన్న ఒకే ఒక భవనం సరిపడని పరిస్థితుల్లో పలు రాతి విగ్రహాలను నిర్లక్ష్యంగా మూలన పడేశారు. సరిపడా సిబ్బంది కూడా లేరు. కార్యాలయం, సెక్యూరిటీ సిబ్బంది 10 పోస్టులు భర్తీ చేయాల్సి ఉంది. ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలకు కేంద్రంగా ఉన్న ఈ మ్యూజియానికి సరిపడా భవనం లేక చరిత్రకు చెదలు పట్టే దుస్థితి దాపరించింది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పురావస్తు సంపదను కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



మూలన పడిన పురాతన విగ్రహాలు



నూతన భవనానికి ప్రతిపాదనలు

పురావస్తు శాఖ మ్యూజియం భవనం ప్రస్తుతం సరిపోవడం లేదు. వర్షాకాలంలో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. కాకినాడ ఎంపీ వంగా గీత సహకారంతో నూతన భవనం నిర్మాణానికి, రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ ఏర్పాటుకు రూ.10 కోట్లతో ప్రతిపాదనలు పంపేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

- తిమ్మరాజు, పురావస్తుశాఖ అసిస్టెంట్ డైరెక్టర్, కాకినాడ

ప్రజా సంక్షేమమే లక్ష్యం : మంత్రి రాజా



కోటనందూరు పర్యటిస్తున్న మంత్రి రాజా

ప్రజాశక్తి-కోటనందూరు
ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని రోడ్లు భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా అన్నారు. శనివారం కోటనందూరులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రజా సమస్యలను వింటూ వాటి పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు జారీ చేస్తూ ముందుకు సాగారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 85 శాతం అమలు చేసిన ఘనత వైఎస్ జగన్మోహన్ రెడ్డి దేనని ఆయన చెప్పారు. వైఎస్.జగన్‌కు వస్తున్న ప్రజాదరణను చూసి ఓర్వలేక చంద్రబాబు దుష్ప్రచారం చేస్తున్నారని చెప్పారు. చంద్రబాబును ప్రజలు నమ్మే ప్రసక్తి లేదన్నారు. కొత్త సంవత్సరంలో సిసి రోడ్లు డ్రైనేజీలను మారుమూల ప్రాంతాల రహదారులను పూర్తిస్థాయిలో నిర్మాణాలు చేపడుతున్నామని ప్రజలకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తుని మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ వెలగా వెంకటకృష్ణాజీ, ఎస్‌సి మాల కార్పొరేషన్ చైర్మన్ పెదపాటి అమ్మాజీ, మండల అధ్యక్షులు లగుడు శ్రీనివాస్, గర్సింగు శివలక్ష్మి దొరబాబు, కురందాసు రాము, ఉల్లూరి శ్రీను పాల్గొన్నారు.

సివిల్ సప్లయీస్ హమాలీల నిరసన

ప్రజాశక్తి-కరప
సివిల్ సప్లయ్ కార్పొరేషన్‌లో హమాలీ కార్మికులు వేళంగి ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద శనివారం ధర్నా నిర్వహించారు. కార్మికుల సంఘ: అధ్యక్షుడు తలాటం వీరవెంకటరావు మాట్లాడుతూ మండలంలో వివిధ రేషన్ షాపులకు వేళంగి ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి ఎగుమతి, దిగుమతు జరిగేవని, ఇప్పుడు నేరుగా బఫర్ గోదాం నుంచి షాపులకు తరలించడం వల్ల హమాలీ కార్మికులుగా పనిచేస్తున్న తమకు పనుల్లేక పస్తులుండే పరిస్థితి ఏర్పడిందని కార్మికులు ఆవేదన చెందారు. 35 ఏళ్లగా ముఠా కార్మికులుగా జీవనం సాగిస్తున్నామని, నేడు ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలతో 150 హమాలీ కార్మిక కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి దాపురించిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి కె.వెంకటశ్రీనివాసరావు కార్మికులు పాల్గొన్నారు.

రైతు సుభిక్షంగా ఉంటేనే దేశాభివృద్ధి



సమావేశంలో మాట్లాడుతున్న రాజబాబు

ప్రజాశక్తి-కాజులూరు
రైతు సుభిక్షంగా, సంతోషంగా ఉంటేనే దేశం పురోభివద్ధి చెందుతుందని ఎపి కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి వల్లు రాజబాబు అన్నారు. జాతీయ రైతు దినోత్సవం సందర్భంగా దుగ్గుదూరులో కడలి రాంపండు వ్యవసాయ క్షేత్రం వద్ద కాటన్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం రాజబాబు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ విధానాల వల్ల వ్యవసాయంలో రైతులు నష్టాలు పాలవుతున్నారని, వ్యవసాయ రంగాన్ని చిన్నచూపు చూడడం వల్లే ఆత్మహత్యలు కూడా పెరుగుతున్నాయని చెప్పారు. భారత్ దేశంలో ఏ రాజకీయ పార్టీ అధికారంలో ఉన్నా పరిశ్రమలకు పెద్దపీట వేస్తూ వ్యవసాయ రంగాన్ని నిర్లక్ష్యం చేయడం వల్ల ఎరువులు, పురుగు మందుల ధరలు 100 శాతం పెరుగుదల, రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేకపోవడం, మార్కెట్ సౌకర్యం కల్పించకపోవడం, అమ్మిన పంటకు సకాలంలో డబ్బులు రాకపోవడం వల్ల రైతులు అప్పుల పాలవుతున్నారని చెప్పారు. రాష్ట్రంలో ఒక్కో రైతుపై రెండు లక్షల 50 వేలు అప్పు ఉందంటే రైతులు ఎన్ని కష్టాల్లో ఉన్నారో అర్థమవుతుందన్నారు. కౌలు రైతుల కోసం తీసుకొచ్చిన 2019 చట్టం కౌలు రైతుకు గుదిబండగా మారిందని, పండించిన రైతు ధాన్యం అమ్ముకునేందుకు కాగితాలు కూడా లేక భూ యజమానిపై ఆధారపడి ధాన్యం అమ్ముకునే పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రభుత్వ రాయతీలు కౌలు రైతుకు రావడం లేదని ఈ చట్టాన్ని సవరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దుగ్గుదూరు సొసైటీ అధ్యక్షులు చిట్టియ్య దొర, ఐఒబి బ్యాంక్ మేనేజర్ అడపా ఆదినారాయణ, సువారు గోవిందు పాల్గొన్నారు. సీనియర్ కౌలు రైతులకు సన్మానం చేసి వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు.

విద్యావ్యవస్థలో విప్లవాత్మకమైన మార్పు



ట్యాబులు అందిస్తున్న ఎంఎల్ఎ సతీష్ కుమార్

ప్రజాశక్తి - తాళ్లరేవు
ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వ పాఠశాలల విద్యలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చారని ఎంఎల్ఎ పొన్నాడ వెంకట సతీష్ కుమార్ అన్నారు. అమ్మ ఒడితో బాటు జగనన్న విద్యా కానుక అందిస్తూ నేడు సాంకేతిక విజ్ఞానాన్ని విద్యార్థుల అరచేతిలోకి అందుబాటులోకి తెచ్చామన్నారు. ప్రైవేట్ స్కూల్ మానేసి, ప్రభుత్వ పాఠశాలలో జాయిన్ అయ్యేవిధంగా నేటి విద్యా వ్యవస్థ మారిందన్నారు. విద్యార్థులకు చక్కటి విద్య అందించడానికి ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలలో మాత్రమే ఉన్నారని గుర్తు చేశారు. తాళ్లరేవు నామన వెంకాయమ్మ జిల్లా పరిషత్ హైస్కూల్లో 180 మంది విద్యార్థులకు, 23 మంది ఉపాధ్యాయులకు బైజూస్ ట్యాబులను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం ఆశాలత అధ్యక్షతన జరిగిన సభలో ఎంపిపి రాయుడు సునీత, జెడ్‌పిటిసి దొమ్మేటి సామ్యూల్ సాగర్, కుడుపూడి శివన్నారాయణ, దున్నా జనార్ధనరావు, వైస్ ఎంపిపి ధూళిపూడి నాగేంద్రప్రసాద్, కొపనాతి నాగరాజు తదితరులు మాట్లాడారు. జగనన్న అందించిన కానుకలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని వీరు ఆకాంక్షించారు. మండలవ్యాప్తంగా 1,041 మంది విద్యార్థులకు 107 మంది ఉపాధ్యాయులకు రూ.కోటీ 60 లక్షల 70 వేల విలువైన ట్యాబులను అందిస్తున్నట్లు ఎంఇఒ ఎ.మంగాయమ్మ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి చిట్టూరి లలిత పద్మ, నందికోళ్ల శ్రీదేవి, రచ్చ ముత్యాలరావు, చలపతి, వాకపల్లి అప్పారావు, కిషోర్ పాల్గొన్నారు.

కొమరగిరి లేఅవుట్‌లో మౌలిక సదుపాయాలు



పనులను పరిశీలిస్తున్న నరసింహారావు

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్
రాష్ట్రంలోనే అతిపెద్ద రెండవ లే అవుట్‌గా ఉన్న కొమరగిరి త్వరలోనే గొప్ప టౌన్‌షిప్‌గా అభివృద్ధి చెందబోతోందని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ సిహెచ్.నాగ నరసింహారావు పేర్కొన్నారు. నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా గృహ నిర్మాణాలను వేగవంతం చేసే క్రమంలో కలెక్టరు కృతికా శుక్లా ఆదేశాల మేరకు శుక్రవారం హౌసింగ్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. నగరపాలకసంస్థ, గృహ నిర్మాణ, విద్యుత్ తదితర శాఖలు, కాంట్రాక్టర్లతో కలిసి కొమరగిరి లే అవుట్‌ను సందర్శించారు. అక్కడి ఇళ్ళ నిర్మాణ ప్రగతిని పరిశీలించారు. సుమారు 350 ఎకరాల విస్తీర్ణంలో దాదాపు 13 వేల ఇళ్ళ నిర్మాణానికి వీలుగా కొమరగిరి లే అవుట్‌ను అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఈక్రమంలో ఇప్పటి వరకు సుమారు 9 వేల మంది లబ్ధిదారులు ఇళ్ళ నిర్మాణం కోసం ముందుకు వచ్చి ఆమోద పత్రాలను కూడా ఇచ్చారని తెలిపారు. ప్రస్తుతం సుమారు 1500 ఇళ్ళకు పునాదులు పడ్డాయని చెప్పారు. రానున్న 2-3 నెలల్లో పెద్ద ఎత్తున ఇళ్ళ నిర్మాణం పూర్తయ్యే పరిస్థితి కనిపిస్తోందని అన్నారు. లబ్ధిదారులుగా ఉన్న స్వయం సహాయక సంఘాల లబ్ధిదారులకు బేస్‌మెంట్ స్థాయిలో రూ.35 వేల చొప్పున బ్యాంకు లింకేజీని కూడా కల్పిస్తున్నామని తెలిపారు. ఇందుకు సంబంధించి 9 వేల మంది ఎస్‌హెచ్‌జీ సభ్యులకు 9 వేల ఐసీఐసీఐ బ్యాంకు ఖాతాలు కూడా తెరిచామని, 4,500 మందికి బ్యాంకు లింకేజీ ఇచ్చామని చెప్పారు. ఆయన వెంట హౌసింగ్ డిఇ గుప్త పాల్గొన్నారు.

మట్టి అక్రమ తవ్వకాల అడ్డగింత



తవ్వకాలను అడ్డగించిన గిరిజనులు

ప్రజాశక్తి-ఏలేశ్వరం
ప్రత్తిపాడు మండలం పాండవులపాలెంలో చెల్లయ్యమ్మ చెరువు నుంచి అనుమతులు లేకుండా జెసిబిలతో మట్టి తరలించుకు పోతున్నారు. దీంతో గిరిజనులు శనివారం మట్టి తవ్వకాలను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా గిరిజన పెద్దలు రేచుకట్ల సింహాచలం మాట్లాడుతూ అధికార పార్టీ అండదండలతో కర్రి శ్రీనివాస్ రెడ్డి, కె.సురేష్ కొంతకాలంగా యంత్రాలతో మట్టి తోలేస్తున్నారన్నారు. ఈ విషయ ప్రశ్నించగా వారికి అధికారులు అనుమతి ఇచ్చారని అడ్డుకుంటే పోలీస్ కేసులు పెడతామని బెదిరించారన్నారు. ఇదే చెరువులో ఉపాధి హామీ పనులు కేటాయిస్తామని గతంలో అధికారులు తమకు తెలిపారన్నారు. చెరువు తవ్వకాలను ఉపాధి హామీలో పెట్టి గిరిజనులకు పనులు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. రెల్లి సత్యనారాయణ, సోమల శ్రీను కరి నాగేశ్వరరావు, ఒఖుగుల సీతారామరాజు, రేసుకట్ల గంగాలమ్మ, ఒడియాల రామలక్ష్మి మహిళలు ఉన్నారు.

తిరుపతి ఆలయానికి రూ.2.04 లక్షల ఆదాయం

ప్రజాశక్తి - పెద్దాపురం
తిరుపతి గ్రామంలోని శ్రీశృంగార వల్లభ స్వామి ఆలయానికి శనివారం వివిధ టిక్కెట్ల ద్వారా రూ.1,46,640, అన్నదానం విరాళాల ద్వారా రూ.58,087 ఆదాయం సమకూరిందని ఆలయ ఇఒ పులి నారాయణమూర్తి తెలిపారు. ఉదయం యాత్రికులకు పులిహోర ప్రసాదం, మధ్యాహ్నం మహా అన్నదానం నిర్వహించామన్నారు. యాత్రికులకు ప్రజా ప్రతినిధులు కుంచే బుచ్చిరాజు, కర్రి జగదీష్, స్వచ్ఛంద సేవకులు, గ్రామస్తులు, ఆలయ సిబ్బంది కృష్ణ, మోహన్ రావు, సత్యనారాయణ, అంజనీకుమార్ తదితరులు సేవలు అందించారన్నారు.

బ్యాడ్మింటన్‌లో బిందు కీర్తనకు ద్వితీయం

ప్రజాశక్తి-కోటనందూరు
తుని ఎపి రెసిడెన్షియల్ స్కూల్ 9వ తరగతి విద్యార్థిని, కోటనందూరుకు చెదిన జి.బిందు కీర్తన కడప జిల్లా పొద్దుటూరులో జరిగిన బ్యాడ్మింటన్ రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచింది. ప్రిన్సిపాల్ వెంకట లక్ష్మి, పిఇటి వరలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా తోటి విద్యార్థులు ఉపాధ్యాయులు బిందు కీర్తనకు అభినందనలు తెలిపారు. తనకు దాతలు ఎవరైనా కోచింగ్ ఇప్పిస్తే జాతీయ స్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొంటానని బిందు కీర్తన అన్నారు.

'కస్తూరిబా'లో ఘనంగా క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి-కోటనందూరు
అల్లిపూడి కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో ప్రత్యేక అధికారిని జి.రాజేశ్వరి ఆధ్వర్యంలో శనివారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. భారతదేశం సర్వమతాల సమ్మేళమని భిన్నత్వంలో ఏకత్వమని ప్రతి ఒక్కరూ మానవతా దృక్పథాన్ని అలవర్చుకుంటూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. క్రిస్మస్ సందర్భంగా విద్యార్థులు క్రైస్తవ సంప్రదాయ నృత్య ప్రదర్శనను ఏసుక్రీస్తు వేషధారణలు పలువురులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జ్యోతి, ఉషారాణి, లక్ష్మీ, రమణమ్మ, మహాలక్ష్మి, కీర్తి, సీతా సమీక్ష తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులపై ప్రజలకు అవగాహన

ప్రజాశక్తి - పెద్దాపురం
వడ్లమూరులో శనివారం సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. టైఫాయిడ్, మలేరియా వంటి రోగాలు సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, దోమల నిర్మూలనకు చేపట్టవలసిన చర్యలపై, పచ్చదనం పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కంటే వీర రాఘవరావు, ఉప సర్పంచ్ చల్ల రామాంజనేయులు, సచివాలయం ఇంజనీరింగ్ అసిస్టెంట్ మురళి తదితరులు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



పలుచోట్ల 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి'



కాకినాడలో..

ప్రజాశక్తి-యంత్రాంగం
కాకినాడ కార్పొరేషన్ 28వ డివిజన్‌లో ఇంటింటికీ వెళ్లి ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వైసిపి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ ప్రచురించిన కరపత్రాలను ఇంటింటికి వెళ్లి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎంఎల్ఎ వనమాడి కొండబాబు మాట్లాడారు. మల్లిపూడి వీరు, గదులు సాయిబాబా, కాకి శ్రీను, రెడ్న సత్తిబాబు, టేకుమూడి సుబ్రహ్మణ్యం, గుర్రాల శ్రీనివాసరావు, నెల్లి రమణ, తుమ్మల సత్తిబాబు, చింతలపూడి రవి, మార్న శ్రీను పాల్గొన్నారు. **తాళ్లరేవు** పి.మల్లవరంలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం క్లస్టర్ ఇన్‌ఛార్జి మందాల గంగ సూర్యనారాయణ, వాడ్రేవు వీరబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి పార్టీ ప్రశ్నాపత్రం ప్రజలకు చదివి వినిపించి జవాబులు పూరించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌టియస్ సభ్యులు ధూళిపూడి వెంకటరమణ (బాబి), పితాని విష్ణు, దున్నా మురళి, దడాల సత్తికొండ, బల్ల చిరంజీవి, ఉంగరాల కృష్ణ, ధూళిపూడి సుభ తదితరులు పాల్గొన్నారు. **కరప** ఉప్పలంకలో కార్యక్రమం నిర్వహించామని టిడిపి పార్లమెంటరీ అధ్యక్షులు పెంకే శ్రీనివాస్ బాబా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వాసిరెడ్డి ఏసుదాసు, వాసంశెట్టి సత్య, చప్పిడి వెంకటేశ్వరరావు, దేవు వెంకన్న, సీతయ్య దొర, దుర్గాప్రసాద్, అప్పారావు చలపతిరావు పాల్గొన్నారు.



కరపలో..



అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

టాయిలెట్స్‌ను ఉపయోగించాలి

ప్రజాశక్తి - పెద్దాపురం
మున్సిపల్ పారిశుధ్య విభాగం ఆధ్వర్యంలో శనివారం పట్టణంలో పలు ప్రాంతాల్లో టాయిలెట్స్ కార్యక్రమంలో భాగంగా టాయిలెట్స్ మాత్రమే ఉపయోగించాలి, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి అనే నినాదంతో ప్రజల్లో అవగాహన కల్పించారు. ఈ సదస్సుల్లో సానిటరీ ఇన్స్పెక్టర్ దావీదు రాజు మాట్లాడుతూ పట్టణ పరిధిలోని మెయిన్ రోడ్, మున్సిపల్ సెంటర్, దర్గా సెంటర్, కొత్తపేట తదితర ప్రాంతాల్లో పబ్లిక్ టాయిలెట్స్ ఉన్నాయని, కొత్తగా మరికొన్ని ప్రాంతాలను గుర్తించామని, ఈ ప్రాంతాల్లో కూడా టాయిలెట్స్ నిర్మిస్తామన్నారు.

పలువురికి జ్యోతుల నెహ్రూ పరామర్శ

ప్రజాశక్తి-గండేపల్లి
మురారి గ్రామానికి చెందిన కిల్లాడ సుబ్బారావు ఇటీవల మరణించడంతో వారి కుటుంబాన్ని తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు జ్యోతుల నెహ్రూ శనివారం పరామర్శించారు. మల్లేపల్లి గ్రామానికి చెందిన పార్టీ నాయకులు గ్రంధి సుబ్రహ్మణ్యం ఇటీవల శబరిమల యాత్ర వెళ్లి అనారోగ్యానికి గురయ్యారుర. ఆయన ఇటీవల స్వగ్రామానికి చేరుకున్నారు. ఆయనను కూడా జ్యోతుల నెహ్రూ పరామర్శించారు. ఈ కార్యక్రమంలో సుంకవిల్లి రాజారావు (రాజు) ఉండవల్లి బుల్లి రాజు, చంద్రాల మల్లేశ్వరరావు, జాస్తి రాధాకృష్ణ, అడుసుమిల్లి, రాజబాబు, పోతుల బాబ్జి, సుంకవిల్లి వీర్రాజు, కాటేపల్లి వీరభద్రరావు, చింతపల్లి వీరభద్రరావు, తెల్లగ రెడ్డి వీరభద్రరావు, కొల్లు త్రిమూర్తులు, తదితరులు పాల్గొన్నారు.

35 సార్లు రక్తదానం చేసిన టీచర్



రక్తదానం చేస్తున్న ఉపాధ్యాయుడు

ప్రజాశక్తి-యు.కొత్తపల్లి
కొత్తమూలపేట పాఠశాల్లో ఉపాధ్యాయునిగా విధులు నిర్వహిస్తున్న అడపా వెంకట శ్రీనివాసరావు వరుసగా శనివారం 35వ సారి రక్తదానం చేశారు. తాను దానం చేసిన రక్తం ఆపదలో ఉన్న వ్యక్తిని కాపాడేందుకు ఉపయోగ పడ్డంలో చాలా ఆనందం ఉందని శ్రీనివాసరావు తెలిపారు. రక్తందానం చేయడం వల్ల ఎటువంటి ఇబ్బందీ కానీ, నీరసం ఉండదని, ప్రతీ ఒక్కరూ సంవత్సరానికి ఒకసారి రక్తందానం చేయాలని శ్రీనివాసరావు పిలుపు ఇచ్చారు.

అంగన్‌వాడీలు, ఆయాల పోస్టుల భర్తీ

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

సామర్లకోట రూరల్ ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని ఒక అంగన్వాడీ కార్యకర్త పోస్టుకు, 15 హెల్పర్ పోస్టులకు ఈనెల 31వ తేదీ లోగా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సామర్లకోట రూరల్ సిడిపిఒ టిడిఆర్ పద్మావతి తెలిపారు. రూరల్ ప్రాజెక్టు పరిధిలోని నవర, చంద్రంపాలెం, వేట్లపాలెం, ఇంద్రపాలెం, నేమాం, పండూరు, తిమ్మాపురం, జీమామిడాడ, పెదపూడి, పైన, కుమారప్రియం, వలసపాకల ప్రాంతాల్లో అంగన్వాడీ హెల్పర్ పోస్టుల భర్తీకి చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 31వ తేదీ శనివారం సాయంత్రం ఐదు గంటల లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. చంద్రంపాలెం, ఇంద్రపాలెం, పెదపూడి గ్రామాల్లో రెండేసి పోస్టులు మిగిలిన గ్రామాల్లో ఒకటి చొప్పున హెల్పర్ పోస్టు ఖాళీలు ఉన్నట్లు ఆమె తెలిపారు. తిమ్మాపురంలో అంగన్‌వాడీ కార్యకర్త పోస్టు ఒకటి ఖాళీగా ఉన్నట్లు తెలిపారు.


ఇళ్ల నిర్మాణాలు పరిశీలిస్తున్న ఎంపిడిఒ

ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

జగనన్న కాలనీల్లో లబ్ధిదారులు గృహనిర్మాణాలు వేగవంతంగా చేపట్టాలని సామర్లకోట ఇన్‌చార్జి ఎంపిడిఒ పిచ్చిరెడ్డి వీరనారాయణ అన్నారు. శనివారం జి.మేడపాడులో జగనన్న కాలనీని ఎంపిడిఒ బృందం తనిఖీ చేశారు. తొలుత సచివాలయంలో హౌసింగ్ నిర్మాణాలపై సిబ్బందితో సమీక్షించారు. అనంతరం గృహ నిర్మాణాల తీరును పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల హౌసింగ్ ఇంజినీర్ ఎం.వెంకటేశ్వరరావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మోరంపూడి రంగా పాల్గొన్నారు.


వైసిపితోనే అభివృద్ధి సాధ్యం

ప్రజాశక్తి-రౌతులపూడి

ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి వైసిపితోనే సాధ్యమని ఎంఎల్ఎ పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ అన్నారు. మండల కేంద్రమైన రౌతులపూడి రెండో సచివాలయ పరిధిలో శనివారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతనంగా మంజూరైన నివాస స్థలాల పత్రాలను జెడ్‌పిటిసి ఒబ్బిలిశెట్టి గొల్ల లక్ష్మణ మూర్తి, డిసిసిబి డైరెక్టర్ పులి మధు, వైస్ ఎంపిపిలు సూరెడ్డి తిరుమల రాయలు, వాసిరెడ్డి మంగ లక్ష్మి భాస్కర్ బాబు, వైసిపి మండల అధ్యక్షులు శ్రీను, సర్పంచ్ అర్జమ్మ లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం గ్రామంలో ప్రభుత్వ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది వివిధ శాఖల అధికారులు తదితరులు ఉన్నారు.

పూర్వ విద్యార్థి కుటుంబానికి సాయం

ప్రజాశక్తి - తాళ్లరేవు


సాయం అందిస్తున్న పూర్వ విద్యార్థులు

స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్లో 87-88 పూర్వ విద్యార్థుల బ్యాచ్‌లో ఇటీవల విద్యుదాఘాతంతో మరణించిన మందారపు సుబ్రహ్మణ్యం కుటుంబానికి డైమండ్ గ్రూప్ మిత్రులు రూ.50,000 ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా సామర్లకోటలోని సుబ్రహ్మణ్యం కుమార్తెకు శనివారం నగదు అందించారు. ఈ కార్యక్రమంలో డైమండ్ గ్రూప్ సభ్యులు పాల్గొన్నారు.

పథకాలతో అన్ని వర్గాలకూ మేలు

ప్రజాశక్తి-ఐ.పోలవరం


గడప..గడపకూ కార్యక్రమంలో ఎంఎల్ఎ

వైసిపి పాలనలో అన్ని వర్గాలకు మేలు జరిగిందని ముమ్మిడివరం ఎంఎల్ఎ పొన్నాడ వెంకట సతీష్ కుమార్ అన్నారు. శనివారం టి.కొత్తపల్లి గ్రామ సచివాలయం పరిధిలో ఉన్న హనుమాన్ సెంటర్ నుండి 63వ రోజు ఉత్తరవాహినిమెరక గడప..గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. సి ఎం జగన్ రాష్ట్రంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నారని అన్నారు కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర కార్యదర్శి కొరకొండ సత్యనారాయణ, వైసిపి మండల అధ్యక్షుడు పిన్నమరాజు వెంకట పతిరాజు, మండల బిసి సెల్ అధ్యక్షులు దొమ్మేటి దుర్గాప్రసాద్, మండల ఎస్‌సి సెల్ అధ్యక్షులు మోర్త చిన్నా, లీగల్ సెల్ మండల అధ్యక్షులు రేవు యజ్జీ, సొసైటీ అధ్యక్షులు ఉద్దిం సత్యనారాయణ, సర్పంచ్ పంద నళిని, ఎంపిటిసి సభ్యురాలు సుమలత, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. **మామిడికుదురు** మామిడికుదురులో శనివారం గడప.. గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో రాజోలు ఎమ్‌ఎల్ఎ రాపాక వరప్రసాద్ పాల్గొని ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ అర్హులందరికీ పథకాలు అందించాలన్నారు. కార్యక్రమంలో కె.ఆదిత్య, ఎమ్‌పిటిసి సభ్యులు వి.తులసీరామ్ తది తరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అందుబాటులో సాంకేతిక పరిజ్ఞానం

ప్రజాశక్తి - అలమూరు


విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేసిన దృశ్యం

ప్రభుత్వ పాఠశాలల్లో చదువు అభ్యసించే విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి తీసుకుని రావాలని సిఎం జగన్ విప్లవాత్మక చర్యలు చేపడుతున్నారని వైసిపి మండల కన్వీనర్, సర్పంచ్ తమ్మన శ్రీనివాస్ కొనియాడారు. చెముడులంక ఎస్‌ఎస్‌ఎస్‌ఎం జెడ్‌పి ఉన్నత పాఠశాల్లో 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లను పేరెంట్స్ కమిటీ చైర్మన్ సూరిశెట్టి శ్రీను శనివారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ పర్సన్ ఇడబాల వీర్రాజు, వైసిపి గ్రామ అధ్యక్షుడు దొండపాటి వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచ్ నాగిరెడ్డి సత్యనారాయణ, వార్డు సభ్యులు, హెచ్ఎం ఎవిడి నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు, నాయకులు, తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాల్ ప్రారంభించాలని రిలే దీక్ష


ప్రజాశక్తి - మండపేట

పట్టణంలోని క్రిస్టియన్ కమ్యూనిటీ హాల్ ప్రారంభించాలని పలువురు క్రైస్తవులు చేపట్టిన రిలే నిరాహార దీక్ష శనివారం నాటికి రెండో రోజుకు చేరుకుంది. ఈ దీక్షకు ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావు, పట్టణ టిడిపి అధ్యక్షుడు ఉంగరాల రాంబాబు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో క్రైస్తవుల కోసం నియోజకవర్గంలో కపిలేశ్వరపురం, రాయవరం, మండపేట మండలాలతో పాటు మండపేట పట్టణంలోను రూ.2 కోట్లతో కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం చేపట్టామన్నారు. ఈ నాలుగు చోట్ల కమ్యూనిటీ భవనాల నిర్మాణాలు పూర్తి చేశామన్నారు. 2019 ఎన్నికలు రావడంతో వాటిని ప్రారంభించలేదన్నారు. పట్టణంలో రూ.కోటి తో నిర్మించిన భవనాన్ని వైసిపి ప్రభుత్వం అధికారం చేపట్టి మూడున్నరేళ్లు గడిచినా నేటికీ ప్రారంభానికి నోచుకోకపోవడం బాధాకరమన్నారు. ఈ విషయంపై తాను సెప్టెంబర్, డిసెంబర్ నెలలో జిల్లా కలెక్టర్ కు సమస్యను వివరించిన ఫలితం లేకుండా పోయిందని అన్నారు.

ఇల్లే లేని వ్యక్తికి 8 కరెంటు మీటర్లని నోటీసు

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

జనవరి-2023 నుంచి పింఛను సొమ్మును పెంచడం మాటేమోగాని ప్రస్తుతం ఉన్న పింఛన్లను పలు రకాల కారణాలతో నిలుపదల చేస్తున్నట్లు లబ్ధిదారులకు వార్డు, గ్రామ వాలంటీర్లు నోటీసులు అందచేస్తున్నారు. దీంతో లబ్ధిదారులకు పలు విచిత్రమైన అంశాలతో జారీ చేస్తున్న నోటీసులు చూసి షాకుల మీద షాకులకు లోనవుతున్నారు. విద్యుత్ వినియోగం 300 యూనిట్లు దాటిందని, మీ పేరున 1000 చదరపు అడుగులు ఇల్లు ఉందని, పలు ఆస్తి పన్నుల అసెస్‌మెంట్లు చెల్లిస్తున్నారని 15 రోజుల్లోగా వివరణ ఇవ్వకపోతే మీ పింఛన్ శాశ్వతంగా రద్దు అవుతుందని


జారీ చేసిన నోటీసు

నోటీసుల్లో హెచ్చరిస్తున్నారు. దీంతో పింఛనుదారులు లబోదిబోమంటున్నారు. స్థానిక మున్సిపాలిటీలో డి.సత్య నారాయణ అనే పింఛనుదారునికి ఏకంగా 8 విద్యుత్ సర్వీసులు ఉన్నాయని, నెలసరిగా సహ నోటీసు ఇచ్చి 300 విద్యుత్ యూనిట్ల వినియోగం దాటిందని, తాత్కాలికంగా పింఛను ఆపామని, 15 రోజుల్లో వివరణ ఇవ్వకుండా పింఛను రద్దవుతుందని మున్సిపల్ కమిషనర్ నోటీసు ఇచ్చారు. తనకు సొంతిల్లు లేదని, తాను అద్దె ఇంటిలో ఉంటున్నానని సత్యనారాయణ ఆవాక్కయ్యారు. సచివాలయానికి వెళితే 8 సర్వీసులకు మీ ఆధార్ నెంబర్ పొరపాటున సీడింగ్ అయ్యిందని, ఒక్కో మీటరు నెంబరును డిలీట్ చేయించుకునేందుకు సచివాలయంలో రూ.35 చొప్పున చెల్లించాలని, చెల్లించాక సదరు రసీదును విద్యుత్‌కార్యాలయంలో చూపించాలని చెప్పారన్నారు. స్వంత ఇల్లు లేకపోయినా 8 కరెంటు సర్వీసులు ఉన్నాయని నోటీసు ఇవ్వడం ఏమిటని ఆయన ప్రశ్నిస్తున్నారు.

ప్రజలకు తాగునీరు అందించాలి

ప్రజాశక్తి -యు.కొత్తపల్లి

మండల ప్రజలకు సక్రమంగా తాగునీరు అందించాలని పిఠాపురం మాజీ ఎంఎల్ఎ, రాష్ట్ర టిడిపి అధికార ప్రతినిధి ఎస్‌విఎస్ఎన్.వర్మ కోరారు. శనివారం మండలంలోని కొమరగిరి, కుతుకుడుమిల్లి పంచాయతీ పరిధిలో ఉన్న చిన్న కలవల దొడ్డి, పెద్ద కడవలదొడ్డి తదితర గ్రామాల్లో పర్యటించారు. సమస్యలపై స్థానిక ప్రజలను అడిగి తెలుసుకున్నారు. గ్రామస్తులు పలు సమస్యలను వర్మకు తెలిపారు. ఈ సందర్భంగా వర్మ మాట్లాడుతూ కొమరగిరి, కుతుకుడుమిల్లి పంచాయితీల్లో వెంకటరాయపురం, చిన్నకలవలదొడ్డి, పెద్ద కలవలదొడ్డిలో తాగునీరు సమస్య విపరీతంగా పెరిగిందని. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో రూ.30 కోట్లతో జలసిరి పథకం ద్వారా నిధులు కేటాయించి, పిఠాపురంలో లోకేష్‌తో శంకుస్థాపన చేసినట్లు చెప్పారు.


ఖాళీ బిందెలను చూపుతున్న ఎంఎల్ఎ వర్మ

నియోజకవర్గం మొత్తం ప్రతి ఇంటికి కుళాయి ఉండేలా అప్పటి టిడిపి ప్రభుత్వంలోనే చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. తక్షణమే ఇంటింటికీ తాగునీటి కుళాయిలు వేయాలని, ఈ కార్యక్రమంలో ఆరిశెట్టి సత్యానందరెడ్డి, బత్తుల చైతన్య రాజేష్, దాయది శ్రీరాములు, కుక్కల రామకృష్ణ, ఎంపిటిసి సన్యాసిబాబు, వీరబాబు, రాంబాబు, చిరంజీవి, సత్తిబాబు పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న ప్రతినిధులు

8న సీపోర్ట్ ఆధ్వర్యంలో మారథాన్

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

జనవరి 8న కాకినాడ సీపోర్ట్ మారథాన్ 5వ ఎడిషన్ కార్యక్రమాన్ని అందరూ విజయవంతం చేయాలని కాకినాడ గ్రన్వర్డ్ ట్రస్ట్ ఫౌండర్ ట్రస్టీ సుధా కేశవరావు కోరారు. కాకినాడ గ్రన్వర్డ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం జీఆర్టి గ్రాండ్ హోటల్లో విలేకరుల సమావేశంలో మారథాన్ గురించి వివరించారు. సుమారు 8వేల్ల నుంచి ఈ మారథాన్ నిర్వహిస్తున్నామని, ఈ మారథాన్‌లో 5కి, బాల్య క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఆధునిక కాలంలో యాంత్రికంగా సాగే జీవితాన్ని ఆరోగ్యంగా ఉంచేందుకు పరుగు చాలా ముఖ్యమని సుధ తెలిపారు. కాకినాడ సీపోర్ట్ సిఇఒ ఎం.మురళీధర్ మాట్లాడుతూ కాకినాడలో 8న కాకినాడ ఎన్టీఆర్ బీచ్ పార్క్ వద్ద నిర్వహిస్తున్నామన్నారు. దీనిలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ వైడి రామారావు, నేమలర్ శ్రీనివాస్, జిఆర్‌టి జిఎం రాజేష్, అల్లూరి, డాక్టర్ రామకృష్ణ, స్పాన్సర్లు తదితరులు పాల్గొన్నారు. కోవిడ్ నిబంధనలు పాటించాలని వారు సూచించారు. అనంతరం ఈ కార్యక్రమానికి సంబంధించిన నాలుగు రకాల టీ షర్టులను ఆవిష్కరించారు.

బాధిత కుటుంబాలకు బాసట

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

పలువురికి ఎంపిపి కారే సుధా శ్రీనివాస్ శనివారం సాయం అందజేశారు. కోనపాపపేటకు చెందిన వక్షవాతంతో బాధపడుతున్న వాసుపల్లి శ్రీను ఇటీవల మృతి చెందిన ఎజ్జల బంగారి కుటుంబ సభ్యులకు పరామర్శించి రెండు బియ్యం బస్తాలు, రూ.5 వేల ఆర్థిక సాయం అందజేసి వారి కుటుంబ సభ్యులకు భరోసా కల్పించారు. ఎటువంటి సహాయ సహకారాలు కావాలన్నా తనకు తెలియపరచాలని ఆయన సూచించారు. ఆయన వెంట కారే మారయ్య, ఎర్రయపల్లి దేవుడు, ఉమ్మడి అప్పారావు, తిత్తి ధనరాజు, చిన్న తదితరులు ఉన్నారు.

బిసి సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షునిగా రవిబాబు

ప్రజాశక్తి - రౌతులపూడి

సీమాంధ్ర బిసి సంక్షేమ ప్రత్తిపాడు నియోజకవర్గ గౌరవాధ్యక్షునిగా రౌతులపూడి గ్రామానికి చెందిన కొల్ల రవిబాబు నియమితులయ్యారు. సీమాంధ్ర బిసి సంక్షేమ రాష్ట్ర అధ్యక్షులు ఉల్లిపాయల శంకరయ్య నుంచి ఉత్తర్వులు వెలువడినట్లు రవిబాబు తెలిపారు

ట్రాన్స్‌ఫార్మర్ తరలింపుపై హర్షం

ప్రజాశక్తి-ఏలేశ్వరం

ప్రత్తిపాడు మండలం పోతులూరు ఎంపియుపి పాఠశాలలో భయాందోళన గురి చేస్తున్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను తరలించడంపై ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. డిఇ రత్నాలరావు, ఎడిఇ రాజశేఖర్, ఎఇ సుబ్రమణ్యం సిబ్బందితో వచ్చి ట్రాన్స్‌ఫార్మర్‌ను వేరే ప్రాంతానికి తరలించి గ్రామస్తుల మన్ననలను పొందారు.

కోటనందూరులో గుండె వైద్య శిబిరం

ప్రజాశక్తి-కోటనందూరు

కోటనందూరు ప్రజా వైద్యశాలలో శనివారం డాక్టర్ వైఎస్.రావు, విజయవాడ ఆక్టా కార్డియాక్ సెంటర్ వైద్య బృందం ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఎంపిపి ఎల్.శ్రీనివాస్ శనివారం ప్రారంభించారు. కోటనందూరు, నాతవరం, తుని మండలాలకు చెందిన 80 మందికి ఉచిత గుండె వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి రామ్ నాయుడు, వైస్ ఎంపిపి కె.రమణమ్మ కృష్ణ, సర్పంచ్ జి.శివలక్ష్మి దొరబాబు, విద్యా కమిటీ చైర్మన్ ఉల్లూరి శ్రీను పాల్గొన్నారు.


కార్మికులకు దుస్తులు అందజేస్తున్న వీరమణి, ప్రసాద్

పారిశుధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ

ప్రజాశక్తి - మండపేట

ఇప్పనపాడు గ్రామపంచాయతీ పరిధిలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు యూనిఫామ్, దుస్తులను గ్రామ సర్పంచ్ కుంచే వీరమణి, ఉప సర్పంచ్ కుంచె దుర్గాప్రసాద్ లు శనివారం పంపిణీ చేశారు. ఈవారు మాట్లాడుతూ గ్రామ పరిశుభ్రతలో పారిశుధ్య కార్మికుల చేస్తున్న సేవలు వెలకట్టలేనివని. చెత్తను కార్మికులకు అందించడంలో గ్రామ ప్రజలు సహకరించాలని వారు కోరారు. అనంతరం పారిశుధ్య కార్మికులకు క్రిస్మస్, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి సుబ్బారావు, జూనియర్ అసిస్టెంట్ పద్మ, శానిటరీ సూపర్వైజర్ మగ్గం రాంబాబు, పారిశుధ్య కార్మికులు అనంతరావు రాజు, ఇంజె యాకోబు తదితరులు పాల్గొన్నారు.

మహిళల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి - ఆలమూరు

మహిళలకు ఆర్థిక అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం రుణమాఫీ చేస్తుందనిమడికిలో సర్పంచ్ ఉండ్రాజపు లక్ష్మి మౌనిక అన్నారు. వైఎస్ఆర్ క్రాంతి పథం మహిళా సాధికార సంస్థకు చెందిన ఆలమూరు ఎపిఎం ఎం.ధనరాజు ఆదేశాల మేరకు స్థానిక విఒల ఆధ్వర్యంలో మడికిలో సర్పంచ్‌కు శనివారం రుణమాఫీ అర్హత జాబితాను అందజేసి నోటీస్ బోర్డ్ నందు ప్రదర్శించారు. సర్పంచ్ మాట్లాడుతూ ఈ జాబితాను పరిశీలించుకుని అర్హత గల వారికి ఏమైనా సమస్యలు ఉంటే తెలియచేయాలని స్థానిక విఒలకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో యానిమేటర్లు సిహెచ్.హర్షవర్ధని, కె.సత్యవేణి, సిహెచ్.దుర్గాదేవి, ఎం.గన్నమ్మ, సిహెచ్.లక్ష్మీభార్గవి, డ్వాక్రా సభ్యులు పాల్గొన్నారు.

చెముడులంకలో కంటి వైద్య సేవలు

ప్రజాశక్తి - ఆలమూరు

చెముడులంక శ్రీసత్యదేవరాయ కాపు కళ్యాణ మండపంలో హాస్పెన్ ఐ హాస్పిటల్ రావులపాలెం వారు ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సర్పంచ్ తమ్మన శ్రీనివాస్ శనివారం ప్రారంభించారు. అలాగే రాజమహేంద్రవరం డాక్టర్ ఆగర్వాల్ ఐ హాస్పిటల్ వారు రూ. 1200 విలువచేసే లేజర్ చెకింగ్ ఉచితంగా చేస్తారన్నారు. అందులో చికిత్స అవసరం అయిన వారికి సబ్సిడీ ద్వారా లేజర్ ఆపరేషన్ చేస్తారన్నారు. ఈ సేవలను వినియోగించుకోవాలని సర్పంచ్ తమ్మన, డాక్టర్ నాజీర్, హరి తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి యు.రేణుక, ప్రెసిడెంట్ గ్రామ అధ్యక్షుడు దొండపాటి వెంకటేశ్వరరావు, దొండపాటి చంటి, అడబాల వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

కపిలేశ్వరపురంలో అన్న సమారాధన

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

కపిలేశ్వరపురం ఓడల రేవు అంజనేయస్వామి ఆలయం వద్ద రజక సంఘం ఆధ్వర్యంలో శనివారం భారీ అన్న సమారాధన నిర్వహించారు. స్వామి ఉత్సవాలు ముగింపు సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఈ భారీ అన్న సమారాధనకు ప్రజలు తరలివచ్చారు.

గెయిల్ ఇండియా ఆధ్వర్యంలో బుర్రకథ

ప్రజాశక్తి - ఆలమూరు

కొత్తూరు ప్రభుత్వ హైస్కూల్లో గెయిల్ ఇండియా ఆధ్వర్యంలో శనివారం బుర్రకథ ప్రదర్శన జరిగింది. ఇందులో భాగంగా బుర్రకథ నిర్వాహకులు గొర్రెల రాము, కృష్ణ సోదరులు మహాభారతంలో ఉత్తర కళ్యాణం ఘట్టాన్ని వివరించారు. అలాగే గేల్ ఏర్పాటు చేసిన సహజవాయువు పైప్‌లైన్లు వాటి రక్షణకు అమర్చిన వాల్వులు, వివిధ యంత్రాలు, హెచ్చరిక బోర్డులు, డిస్ట్రిక్ట్‌ను సూచించే స్తంభాలు వంటి వాటిని రక్షించుకోవాల్సిన బాధ్యత మన అందరి పైన ఉందన్నారు. ఇందుకు తీసుకోవలసిన జాగ్రత్తలు, సామాజిక సేవలు వినోదాత్మకంగా, విజ్ఞానంగా వారు బుర్రకథ ద్వారా తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎస్ లావణ్య కుమార్ రాజా, ఇంచార్జ్ హెచ్ఎం రాజు, ఉపాధ్యాయులు ధర్మరాజు, తదితరులు పాల్గొన్నారు.

బోడసకుర్రులో అగ్నిప్రమాదం

ప్రజాశక్తి - అమలాపురం

అల్లవరం మండలం బోడసకుర్రులో శనివారం సాయంత్రం అగ్ని ప్రమాదం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం జక్కా కామేష్ అనే వ్యక్తికి చెందిన కిరాణా దుకాణం వెనక గోడౌన్‌లో ఒకసారిగా మంటలు వ్యాపించాయి. వెంటనే పోలీసులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. ప్రమాదంలో కిరాణా షాప్‌కు సంబంధించిన పలు ఉల్లిపాయ మిరప బస్తాలు, డొక్క తాళ్లు ఇతర వస్తువులు దగ్ధమయ్యాయి. అగ్నిప్రమాదానికి షార్ట్ సర్క్యూట్ కారణమని భావిస్తున్నారు. అగ్ని మాపక సిబ్బంది.వచ్చి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. రెండు నెలల క్రితం ప్రస్తుత దుకాణ యజమానికి చెందిన గొడౌన్లో అక్రమంగా నిల్వ ఉంచిన బాణసంచాను పోలీసులు సీజ్ చేశారు.

అర్జీల పరిష్కారానికి చర్యలు

ప్రజాశక్తి - మండపేట

ప్రజల నుంచి వచ్చే అర్జీలను పరిష్కరించడంలో చర్యలు చేపట్టాలని, స్పందన రిజిస్టర్లు తప్పనిసరిగా నిర్వహించాలని మండల అభివృద్ధి అధికారి ఐదం రాజు అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన గుడ్ గవర్నెన్స్ పై అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ ప్రతి సచివాలయంలో మధ్యాహ్నం మూడు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటలు వరకు నిర్వహించే స్పందన కార్యక్రమంలో ఉద్యోగులు పాల్గొనాలన్నారు. ఆయుష్మాన్ భారత్ ఈ కేవైసీ తప్పనిసరిగా చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో పరిపాలన అధికారి వి.ఎస్.ప్రసాద్, మండలంలోని సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు. **ఆలమూరు** మండల పరిషత్ కార్యాలయంలో గుడ్ గవర్నెన్స్ పై కార్యదర్శులకు ఎన్ఎస్ఎం లకు శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంఇఒ డి.మురళి సత్యనారాయణ, ఇఒపిఆర్‌డి రాజ్ కుమార్, చొప్పెల పిహెచ్‌సి వైద్యాధికారి ఎం.సుమిత, మండల పరిషత్ ఏఒ వి.రామ న్యాయవాది లు మాట్లాడుతూ వర్తిలో ప్రణాళికలు రూపొందించుకొని



మండపేటలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న అధికారులు

ప్రణాళికలను పాటించుకోవాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేస్తూ నిజమైన లబ్ధిదారులకు అందజేయాలన్నారు. ఈ సందర్భంగా వివిధ శాఖల మండల స్థాయి అధికారులు పాల్గొని వారి అనుభవాలను వివరించారు. కార్యక్రమంలో ఎపిఎం ధనరాజు, హౌసింగ్ ఎఇ డి.శ్రీనివాస్, పెద్దపల్ల పిహెచ్‌సి వైద్యులు పి.భవాని శంకర్ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

జనసేనతోనే రైతుల సంక్షేమం : పితాని

ప్రజాశక్తి - తాళ్లరేవు

జనసేనతోనే రైతు సంక్షేమం సాధ్యమని ఆ పార్టీ ముమ్మిడివరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పితాని బాలకృష్ణ అన్నారు. జాతీయ రైతు దినోత్సవం సందర్భంగా జార్జిపేటలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు అత్తిలి బాబూరావు అధ్యక్షతన జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. ఏ అధికారం లేకపోయినా రాష్ట్రంలోని కౌలు రైతులకు రూ.30 కోట్ల కష్టార్జితాన్ని ఇచ్చిన మహ నేత పవన్ కళ్యాణ్ అన్నారు. రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర రాక వీరిద్దరి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఎన్నడూ చూడని విధంగా రైతు కష్టాలు పడుతున్నారన్నారు. రైతు పక్షపాతిగా ఉన్న జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌కు అందరూ మద్దతుగా నిలవాలని కోరారు. ఈ సందర్భంగా పలువురు రైతులను వారు సత్కరించారు. బాలకృష్ణ తదితరులు పితాని దృష్టికి తీసుకొచ్చారు. ఆ అంశాలను పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్తానని ఆయన హామీ ఇచ్చారు. అనంతరం స్థానిక రైతులు గుత్తుల వివ్వయ్య, పిల్లి సత్యనారాయణ, కసకల వెంకటేశ్వరరావు, చిట్టూరి మహేష్, శీలం కృష్ణమూర్తులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ముత్యాల జయలక్ష్మి, వీర్ల వీర, టేకుమూడి త్రిమూర్తులు, రాయుడు గోవిందు, సలాది శ్రీనివాస్, కర్రెడ్డి నాని, గెద్దాడ శ్రీనివాస్, వినుకొండ నాగేంద్ర, ఎ.రవి తదితరులు పాల్గొన్నారు.


రైతులను సన్మానిస్తున్న జనసేననేత పితాని బాలకృష్ణ

నేరాలు ఘోరాలు

ఎస్‌సి, ఎస్‌టి కేసు నమోదు

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

దౌర్జన్యం చేశారంటూ వచ్చిన ఫిర్యాదు మేరకు శనివారం పోలీసులు ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేశారు. ఎస్ఐ జి.వెంకటేశ్వరరావు తెలిపిన వివరాలివి.. అమలాపురం రూరల్ మండలం సమనస కు చెందిన ఆయిల్ ట్యాంకర్ డ్రైవర్ కాశి సత్యానందం శుక్రవారం రాత్రి ఎస్.యానాంలో ఆయిల్ అన్ లోడ్ చేసుకుని తిరిగి వస్తున్నాడు. ఆయితే చల్లపల్లి మెయిన్ రోడ్ లో అదే గ్రామానికి చెందిన దంగేటి నాగ బాబు రోడ్డుపై అడ్డంగా ఉండడంతో హారన్ వేశారు. దీంతో ఆగ్రహించిన నాగబాబు సత్యానందంను లారీ క్యాబిన్ లో నుంచి కిందకు లాగడంతో గాయపడ్డారు. సత్యానందం అమలాపురంలో ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందారు. బాధితుడు ఫిర్యాదు మేరకు నాగబాబుపై పోలీసులు ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేశారు. సంఘటన జరిగిన అనంతరం చల్లపల్లి మెయిన్ రోడ్డుపై రాస్తారోకో చేసి ప్రజలకు ఇబ్బందులు కలుగజేసిన 25 మంది ఆందోళనకారులపై కేసు నమోదైంది.

వ్యక్తిపై దాడి.. కేసు నమోదు

ప్రజాశక్తి - గోపాలపురం

ఒక వ్యక్తి కోల్పోయిన ఉద్యోగం తిరిగి ఇప్పించేందుకు సహకరించడం లేదనే కోపంతో సహకరించని వ్యక్తిపై దాడికి పాల్పడిన సంఘటన గోపాలపురంలో శనివారం చోటుచేసుకుంది. ఎస్ఐ కె.రామకృష్ణ తెలిపిన వివరాలివి.. బీమోలు చెందిన బి. నరసింహా రావు గోపవరం సమీపంలో ఉన్న ఓ బీరు ఫ్యాక్టరీలో సెక్యూరిటీ గార్డ్‌గా పనిచేసేవాడు. పలు కారణాలతో నరసింహా రావును కంపెనీ యాజమాన్యం విధుల నుంచి తప్పించింది. గోపవరానికి చెందిన ఎండపల్లి శ్రీనివాస్‌బీరు ఫ్యాక్టరీలో గుత్తే దారునిగా వ్యవహరిస్తున్నాడు. శ్రీని వాసును ఉద్యోగం కోల్పోయిన నరసింహా రావు తొలగించిన తన ఉద్యోగాన్ని మరల ఇప్పించా లంటూ పలుమార్లు అభ్యర్థించాడు. తనకు ఉద్యోగం ఇప్పించ లేదన్న కోపంతో శనివారం ఉదయం శ్రీనివాస్ ఇంటికి కి చొరబడి అతని కంట్లో కారం చల్లి, పెట్రోలు శ్రీనివాస్ కారుపై పోసి నిప్పు పెట్టాడు. నరసింహారావు తనను తీవ్ర దుర్భాష లాడు తూ బెదిరించినట్లు బాధితుడు ఎండపల్లి శ్రీనివాసు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు. నిందితుడు పరారీలో ఉన్నట్లు ఎస్ఐ తెలిపారు.

కలప స్వాధీనం.. వాహనం సీజ్

ప్రజాశక్తి - గోపాలపురం

వాదాలకుంట సమీపంలో 550 వెదురు కర్రలతో బొలెరో వాహనంపై అక్రమంగా రవాణా చేస్తుండగా విశ్వసనీయ సమాచారం మేరకు వాహనాన్ని అదుపులోకి తీసుకొన్నట్లు ఫారెస్ట్ రేంజర్ సత్యనారాయణ తెలిపారు. కలప సుమారు రూ.56 వేల విలువ ఉంటుందని ఆయన తెలిపారు. సీజ్ చేసిన వాహనాన్ని, కలపను రాజమహేంద్రవరం ఫారెస్ట్ ఆఫీసుకు తరలించినట్లు తెలిపారు. ఆయన వెంట డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ సిహెచ్. శ్రీనివాసరావు, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ ఎం. కార్తీక్ ఉన్నారు.